# మణి

నేను శలవులకి ఇంటికి వచ్చినప్పుడల్లా వచ్చినరోజే మణికోసం కబురు పంపేవాణ్ణి. చెన్నపట్నంనుంచి ఏ రిబ్బనో, జాకెట్టో మణికోసమని తెచ్చేవాణ్ణికనకనో, లేక నా మీద చనువో, అలవాటో గంతులేస్తోవచ్చి, చాచివున్న నా చేతుల్లో వురుకుతుంది. పదిరోజులు కానీ, నెలరోజులుకానీ, నాతోనే వుంటుంది. భోజనం ఒకే విస్తట్లో, నిద్ర ఒకే పక్కమీద, కాఫీ కప్పులో ఇలా ఇద్దరమూ ఐక్యమయే వాళ్ళము నేను మణికి జడవేస్తాను. మణి నా పొట్టి జుట్టుకి మల్లె పూలదండలు కడుతుంది. సిగరెట్టు నీటుగా వెలిగిస్తుంది. అగ్గిపుల్ల ఆర్పకుండామీద పడవేస్తుంది. పొగనంతా మొహాన భరిస్తుంది. లెఖ్ఖలూ, ఇంగ్లీషూ నేర్చుకుంటుంది. మంగళహారతులూ, గచ్చకాయలు నేర్పుతుంది. ఎక్కువ చక్కిలిగిలి పెడితేనూ, నభో మణి అని పిలుస్తేనూ, చెంపకాయలు కొడుతుంది మణి బొద్దయినపిల్ల. నా వేళ్ళు ఆమె నడుములో మెత్తగా దిగపడేవి. నవ్వుకూడా అంత మృదువుగానూ నా చుట్టూ కంపించేది. పెద్ద కళ్ళనిండా నవ్వుతో నీళ్ళు నిండితే రాత్రి నక్షత్రం మీద మబ్బు పాకినట్టు వుంటుంది.

నాలుగో యేడు. ఎండాకాలంలో మా చిట్టినిపిల్చి "మణిని పిలవ్వే" అన్నాను.

చిట్టి పరుగెత్తుతూ వుంది.

మా అమ్మ "ఇంకా ఏం మణి? మణి పెద్ద మనిషి అయింది" అంది.

"ఐతే—"

"ఐతే ఎట్టా వస్తుంది?"

రాకుండా ఎట్టా వుంటుంది అనుకుంటున్నాను. ఇంతలో చిట్టివచ్చి, "మణి మాట్లాడలేదు" అంది.

"జాజిపువ్వులు, సర్కసుబొమ్మ, ఆపిల్‌పళ్ళూ తెచ్చాడని చెప్పు."

"అక్కడికి తెమ్మంటోంది."

నేను పంపలేదు.

రెండురోజులు ఏమో తడుముకున్నట్టుంది. అప్పుడప్పుడు "మణి ఎందుకు రాదు?" అనుకుంటూ వున్నాను. జడలూ, పాటలూ, పాఠాలూ, అన్నీ ఆదరించేవాళ్ళు లేక అనాథలై నా చుట్టూ కొట్టుకుంటున్నాయి. వాళ్ళ అమ్మ కనపడ్డది మా వంటింటి గుమ్మంలో—

"మణి ఏదండీ? కనబడలేదు యీసారి?"

"మణి పెద్ద మనిషి అయింది నాయనా"

"ఐతే కనపడ్డానికేం?"

"సిగ్గుపడుతోంది గావును."

నేను వెళ్ళి తీసుకొస్తే! ఎన్నడూ వాళ్ళింటికి వెళ్ళలేదు. కొత్త, దాక్కుంటుందేమో! చిట్టి నడిగాను.

"నీ సంగ తడిగింది యాపిల్ పళ్ళన్నీ అయిపోయినాయా?" అంది.

మర్నాడు పొద్దున "మెకాలే" చదువుతోంటే మణి కంఠం వినబడ్డది. లేచి వెళ్ళాను. వంటింటిలో అమ్మదగ్గర మాట్లాడుతూ కూచుని వుంది.

"ఏం మణీ, దర్శనమే లేదు?"

పలకలేదు. నేను సిగ్గుపడి రోషపడి వెళ్ళిపోయి భర్తృహరి బిగ్గరగా చదువుతూ వున్నాను.

"ఏం బావుంది, సంగీతం?"

కళ్ళెత్తి చూసి యింకా బిగ్గరగా చదువుతూ వున్నాను. పుస్తకం అవతల పారేసి వొళ్ళో కూచుంది. గట్టిగా కావిలించుకుని బుగ్గలని ముద్దు పెట్టుకున్నాను. అట్లా అతుక్కుని కూచుంది.

"మణీ, రాలేదేం యిన్నాళ్ళు?" ఎంత అడిగినా మాట్లాడలేదు. నేనెందుకు ముట్టుకున్నాను? అప్పుడాలోచించలేదు. న్యాయమనీ తోచలా, అన్యాయమనీ తోచలేదు. ఇప్పుడాలోచిస్తే ఏం తోస్తుందంటే, మణి అంత కాలం కనపడక, తటాలున నా వొళ్ళో కూచోడంచేత అనుకుంటాను. ఆ సంతోషంవల్ల మణి వెళ్ళిం తరవాత కూడా ఆ స్పర్శవల్ల కలిగిన సుఖం నన్ను వదల్లేదు.

మునపటిమల్లే కాకపోయినా పొద్దునా సాయంత్రమూ మణి వస్తోంది పాటలు పాడుతున్నాము. చదువుకుంటున్నాము. కాని కావలసి ఒకరికొకరం తాకుతోగాని కూచోము. చాలాసార్లు ముద్దు పెట్టుకుంటున్నాను. అలస్యమైతే మొహమెత్తి చూస్తుంది.

ఆవాళ సాయంత్రం హార్మోనియం వాయిస్తున్నాను మణి దిద్దుతోంది నా వేళ్ళని.

"నిదమ పనిస అని వేస్తావేం?"

"ఎక్కడిది?"

"కొనుక్కున్నాను."

"ఏమిటి?"

"వ"

"దాచుకో, ఈ పాటలోకి రానీకు."

"ఎక్కడ?"

"ఏమిటి, ఎక్కడా?"

"దాచుకునేది"

"వాయిద్దూ"

"చంపలా?"

"అవును"

వాయించాను.

కళ్ళు నీళ్ళతో నిండాయి!

"చిన్న మణీ, దెబ్బ తగిలిందా?"

తలని రొమ్ము దగ్గరకు లాక్కుని ముద్దు పెట్టుకుని ఆమె తలెత్తాను

అమ్మ అట్టా వెడుతోంది!

మర్నాడంతా మణి రాలేదు.

గిజ గిజ లాడాను.

"చిట్టీ! మణి రాలేదేం?"

"ఇంట్లో ఏడుస్తోంది."

"ఎందుకు?"

"ఏమో మాట్లాడదు."

"వాళ్ళమ్మను అడగలా?"

"వాళ్ళమ్మా మాట్లాడదు"

"వస్తుందో,నన్నువచ్చిలాక్కు-రమ్మంటుందోఅడుగు"అమ్మవచ్చింది.

"మణి వస్తుంది. అదేమీ కాపరం చెయ్యక్కర్లేదా?" అంది.

అప్పటికీ పూర్తిగా నాకు అర్థం కాలేదు.

రెండురోజులుచూశాను.మణినిచూడకుండావుండలేనిపరిస్థితికివచ్చాను.

చిట్టిచేత చీటీ పంపాను. మణి చీటీ దాచుకుంది. మాట్లాడలేదు.

మా మేనమామ యింట్లో బారసాల అయితే వెళ్ళాను. వారం రోజులు ఉండివస్తే తోస్తుంది అనుకున్నాను. మొదటిరోజున హడావుడిలో మణిని మరచిపోయినాను. సాయంత్రం ఆ వూళ్ళో కుర్రాళ్ళు వచ్చి షికారు తీసుకుపోయారు. ఏరు ఎండిపోయింది. తెల్లని యిసకలో వెన్నెట్లో పడు కునేటప్పటికి మణి జ్ఞాపకం వచ్చింది. మణీ నాకోసం వచ్చి వుంటే? గది ముందు స్థలంలో నారింజ చెట్టుకింద సగం వెన్నెలపడుతో కూచునివుంటే? పని ఉందని లేచి వెళ్ళి రాత్రి రైలుకే బయలుదేరి యింటికి వచ్చాను. ఆ రాత్రి మణి కనబడితే ఎంత బాగుంటుంది! నాకోసం చూస్తూ అరుగుమీద నుంచుని వుంటే!

ఎవరూ లేరు. అంత త్వరగా వచ్చినందుకు రాత్రంతా అమ్మ చివాట్లు పెడుతూనే వుంది. మర్నాడు మణి కనబళ్ళేదు. చిట్టితోనన్నా మాట్లాడదు మణి.

ఎండాకాలం తరవాత చినుకులుపడ్డ మొదటి సాయంత్రం అది. రాత్రి యెనిమిదింటికే బజారులన్నీ చినుకుల శబ్దం తప్పితే యింక సందడి లేకండా వున్నాయి. సన్న చినుకులు పడుతున్నాయి. మా యింటి సందు తిరిగేటప్పటికి చినుకుల్లో ముందు నడుస్తున్న పిల్ల మణిగా తోచి, దగ్గిరగా ఆగి చూశాను.

"మణీ, యీ వానలో యెక్కణ్ణించి వస్తున్నావు?"

మాట్లాడలేదు.

"తడుస్తున్నావు" అని గొడుగు నెత్తిమీద పెట్టాను.

గొడుగులో పడే చిన్న కన్నీళ్ళవాన ప్రారంభమయింది. గొడుగుని రెండో చేతికి సద్దుకుని మణి మెడమీద చేయివేసి "ఎందుకు? కోపవద్దా?"

"అంతా మీ అమ్మగారు చెప్పారు! మా అబ్బాయి మంచివాడు కాడు. మీ పిల్ల—"

ఒక్క నిమిషంలో యెంత తిరుగుబాటు తోచిందో చెప్పలేను. సరే చెడ్డవాణ్ణేగా! నా మీద నమ్మకంలేదుగా ఆ మాట నాతో అనకూడదూ? నా వెనకాల సాడీలు చెప్పి నా మణికీ, నాకూ యింత వ్యసనం కల్పించి మా తపనను చూసి నవ్వుకుంటున్నారు కాబోలు! చూస్తానుకదూ! నే నంత అప్రయోజకుణ్ణా? వాళ్ళ తంత్రాలకు లొంగుతానా? విడతీస్తారా మమ్మల్ని, సరే దుర్మార్గమే చేస్తాను. ఏం చెయ్యగలరు?

సగం తెలిసీ తెలియకుండా మా యింటి అరుగు ఎక్కేటప్పుడు మణితోకూడా వెళ్ళాను. ఇద్దరం గదిలోకి వెళ్ళాము.

"యింత ఆలస్యమయిందని మీ వాళ్ళేమన్నా అంటారేమో."

"అననీ!"

"మళ్ళా ఎప్పుడు?"

"ఎప్పుడో వస్తాగా మరి వెడతాను."

"నువ్వేమీ కబుర్లు పంపకు. నేను వొస్తానుగా!"

"నిజమా?"

"నిజం"

"వెడుతున్నావా? ఒకసారి"

"వుండు, పెదిమ మంట పుడుతోంది"

(కొంచెం ఆలోచించి) "కనపడుతుందా? చూడు"

"చీకట్లో ఎట్లా కనబడుతుంది? నన్ను తాకి చూడనీ"

ఆ చిన్న చిన్న సాహసాలుచేస్తే, ఎట్లా నరాలన్నీ చలించిపోయేవి!

"ఉండు వెళ్ళకు. ఇట్లా వెడితే—"

"జుట్టు సద్దనీ, నువ్వు వెళ్ళద్దు—"

"మళ్ళీ వొచ్చిందాకా యేం చెయ్యను? నేను నిన్ను యెత్తుకు వెళ్ళిపోతాను."

ఇప్పుడు తలుచుకుంటే నవ్వు వొస్తుంది. ఎక్కడకు ఎత్తుకు వెడతాను, నా మొహం! నాకు తెలుసు ఒప్పుకోదని. అందుకనే ఆ బడాయి. "సరే ఒస్తాను పద" అంటే ఏమనేవాణ్ణో! కాని నవయవ్వనపు శోభ. అనే

లోకంలో ఆకలి బాధలూ, ధనమూ, దారిద్రము. టిక్కెట్టు కలెక్టరూ, మేస్ట్రీటు కోర్టులూ, వున్నాయని అంగీకరించదు.

నేను మళ్ళీ కాలేజీకి వెళ్ళే లోపల, మణి పది, పన్నెండుసార్లు వచ్చింది. మణినే ప్రేమిస్తున్నానని, మణిని వదలకూడదని అనిపించేది. కాని ఎట్లా వదలకుండా వుండాలో, ఇంకొకడి భార్యను ప్రేమించి ఉంచు కోడం ఎట్లాగో ఆలోచించే జ్ఞాపకశక్తి యింకాలేదు.

ఆ శక్తి ఉంటే మాత్రం యేంచేసి ఉందును? కొన్ని సమస్యలలో కిందామీదా పడేవాణ్ణి. అంతేగాని పర్యవసానం ఒకటేగా?

ఆఖరురోజున చాలా యేడ్చింది మణి. మణి విచారంకన్న నాకోసం యింకో ప్రాణి అట్లా బాధపడడం చూసి ఎంతో గర్వమనుభవించాను.

దసరా శలవలకు వచ్చేటప్పటికి మణిలేదు. అత్తవారింటికి వెళ్ళింది. మణిని మళ్ళీ నేను చూడలేదు. కాని ఆ పిల్లను నేను మరువనూ లేదు. కొత్తలో నా భార్యని మణితో యెన్నడూ మనసులో పోల్చుకునేవాణ్ణి. మణి నవ్వినప్పుడు బుగ్గమీద సొట్టా, కళ్ళక్కొని కొంటి తనమూ, నన్ను వదలక ఏడ్చిననాటి ప్రేమా, అన్నీ జ్ఞాపకంవచ్చి నా భార్యతో యెంత అన్యోన్యంగావున్న నిమిషాన్నైనా సరే నిట్టూర్పు విడిచి, ఆలోచనలో పడ తాను. మొన్న మళ్ళీ ఫిల్ములో మిస్ పద్మాదేవిని చూసినపుడు నాచిన్నప్పటి మణి జ్ఞాపకంవచ్చి సగంలో లేచి వెళ్ళిపోయినాను.

పదిహేనేళ్ళు గడిచింది నాకు భద్రాచలం ట్రాన్స్ఫరైంది. ఇది వరకటి ఇన్స్పెక్టరుగారున్న యిల్లే నాకు ఏర్పాటు చేశారు. ఆ ఇల్లు రెండు భాగాలు. ఒక భాగంలో ఆ వూరు పోస్టుమాస్టరుగారు, భార్యా అయిదుగురు పిల్లలూ కాపరమున్నారు. ఇవతలి భాగంలో నేనూ, నా తల్లీ, భార్యా, ముగ్గురు పిల్లలూ వున్నాము. మా పడక గదికీ వాళ్ళ భాగానికిమధ్య తలుపు ఉంది. ఇటు మేము గడియ, అటు వాళ్ళు గొళ్ళెం పెట్టుకున్నా మాటలు వినపడకపోవు, ముఖ్యంగా రాత్రులు నిశ్శబ్దంగా వున్నప్పుడు. వాళ్ళ పిల్ల ప్రతిరోజూ రాత్రి యేడుపు. నాకు నిద్ర మెళుకువవస్తే మళ్ళీ పట్టదు.

"నీకేం రోగం పుట్టిందే అట్టా యేడుస్తావు పాడుముండా?" అని దబదబా కొడుతోంది తల్లి. పిల్ల యేడ్చింది.

"చావు వెధవముండా" అని దబీ, దబీ కొట్టడం వినపడ్డది.

పిల్లల్ని కొడితే నే నోర్వలేను. నా గొంతు పిసికినట్లుంటుంది.

"ఎందుకే అట్లా కొడతావు దాన్ని?" అన్నాడు భర్తగావును.

"కొట్టకపోతే సముదాయించండి"

నా భార్య తెలివితక్కువగా ప్రవర్తించినపుడు, సినిమా నటుకు రాళ్ళను చూసి, వాళ్ళ అందాన్ని చాకచక్యాన్ని నా భార్యతో పోల్చుకున్నప్పుడూ, పొరిగింటివారితో అసహ్యంగా అది తగూలాడినప్పుడూ, నాపిల్లలు నల్లగాను, చిన్న కళ్ళతోనూ పుట్టినప్పుడూ. ఇదిగాక మణే నా భార్యఐవుంటే యెంత ఆనందంగా, శాంతంగా రసవజీవితం ఉండేది అని చాలాసార్లు అనుకున్నాను.

"సముదాయించు, నా కదే పని."

పిల్ల గొంతుక విజృంభించి సాధన చేస్తోంది.

తల్లి దాని తలకాయ గోడకేసి కొడుతోంది. "ముయ్యి నోరు ముయ్యి."

పాపం ఆ పిల్ల —

"అమ్మా, అమ్మా" అంటోంది దీనంగా. నా భార్యనులేపి "ఆ పిల్లనలా కొట్టవద్దని అందూ" అన్నాను.

"పోనిద్దురూ మనకెందుకు?"

"అబ్బా భరించలేను ఆ యేడుపు పిలుద్దూ!"

"ఏమండో! ఎందుకండీ పిల్ల నల్లా కొడతారు?"

"కొట్టకపోతే దీని పొగ రెంతనుకున్నారు!"

"చిన్నపిల్లలకు పొగరేమిటండీ? ఎట్లా చేతులొస్తాయి మీకు?"

"ఇంకచాలు నువ్వు పూరుకో! నా పిల్లను కొట్టుకుంటే నీ కెందుకంట? పదేళ్ళు వచ్చినా పెళ్ళి చెయ్యక కూతుర్ని ఎవగ పెట్టుకుంటోంది, నాకు చెప్పొచ్చింది నీతులు!"

నోరు మూసుకున్నాము. యీ గోల విని తండ్రి పిల్ల నెత్తుకొని సముదాయిస్తున్నాడు. మళ్ళీ మాటలు.

"చూడూ, వద్దంటూవుంటే పేరంటాని కని గుడ్డపువ్వు తల్లో పెడితివి. ఎంతలోతు గుచ్చుకుందో నిన్న, మరి యేడిస్తే దాని తప్పా?"

"దానికి బుద్ధిలేదూ? అది గుచ్చుకునేటట్టు పడుకోడం, మరి బంగారు నగలు చేయించారు గనకనా! మరి గుడ్డపువ్వులు పెట్టక ఏం చెయ్యను?"

"చాల్లే వూరుకో"

"మీరే వూరుకోండి"

మర్నాడు పొద్దున్న రాత్రి సంగతులన్నీ జ్ఞాపకం వచ్చాయి—రాత్రి ఆ కంఠం విన్నప్పుడల్లా నాలో ఏదో మధురమైన జ్ఞాపకం కలవరపడ్డట్టు తోచింది. నా భార్యతో ఆమెను చూసి రమ్మన్నాను.

"నేనా? అంత మర్యాదస్తురాలిని!"

వూరుకున్నాను.

నేను సర్క్యూటునుంచి తిరిగివచ్చిన మధ్యాహ్నం మాటల ధోరణిలో.

"ఆ పిల్ల ప్రతిరాత్రీ ఏడుస్తోందా?" అన్నాను. అసలే అలిసి వున్నాను. నిద్రాభంగం అవుతుందని భయం.

"ఏమండోయి, ఆమె పుట్టిల్లు మీవూరేట"

"పేరు?"

"ముత్యమా? మణా యేదో"

అన్నం సయించలేదు. ఆత్రుతతో చెయ్యి కడుక్కుని కొంచెం సేపు బాదం చెట్టుకిందే చూచున్నాను.

మణి వచ్చింది దొడ్లోకి. నన్ను చూసి తలవంచుకొని నీళ్ళు తోడు తోంది. నిదానించి చూస్తేగాని, గుర్తుపట్టలేదు నేను. పేరూ, వూరూ, తెలియక పోతే గుర్తుపట్టలేకపోయేవాణ్ణి.

ఎముకలు తప్ప ప్రాణంలేదు. జుట్టు అసలులేదు. ఇంక ఆ నడక సన్నని కాళ్ళు ఎత్తివేసుకుంటూ.

ఎంత ప్రయత్నించినా, ఆ స్వరూపం. పిల్లని బాదిన ఆ కంఠంతో సరిపోతుందిగాని—

తల, నా రొమ్ముకానించి నావేళ్ళ అద్దుతో గోముగా, నన్ను మరచి పోతావా? ఈ జన్మకాదు, ఎన్ని జన్మలకన్నా మరచిపోతావా?" అన్న మణితో సరిపోలేదు.

మర్నాడు యిల్లు మార్చాము.